సాక్షి వరంగల్

సోమవారం | 4 | సెప్టెంబర్ | 2023



తల్లిని గెంటేసిన తనయుడు

ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొని తల్లిని బయటకు గెంటివేశాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఘటన లింగాలఘణపురం మండలం నేలపోగుల లో చోటు చేసుకుంది.

- 8లో▸



'బుట్ట'లో పడాల్సిందే..

పంటల సాగులో చీడపీడల నివారణకు లింగాకర్షక 'బుట్ట'లతో ఎంతో ప్రయోజనం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన 'మార్నేని'



హన్మకొండ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కలిశారు. బీఆర్ఎస్ అభ్యర్థిత్వం పొంది 7వసారి అసెంబ్లీకి పోటీచేయనున్న సందర్భంగా ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'సర్వేపల్లి' అవార్డుకు సుందర్‌రాజ్ ఎంపిక



నయీంనగర్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు మాస్టర్‌జీ విద్యాసంస్థల చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యావేత్తగా, సామాజికవేత్తగా మాస్టర్‌జీ సోషల్ సర్వీస్ సంస్థ తరఫున సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సుందర్‌రాజ్‌ను అవార్డుకు ఎంపిక చేసినట్లు అమరేష్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో త్వరలోనే నిర్వహించనున్న కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రముఖుల చేతుల మీదుగా సుందర్‌రాజ్‌కు అవార్డు అందజేస్తామని వివరించారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

మెట్ల బావిలో నీటి తొలగింపు



ఖిలా వరంగల్: అభివృద్ధి పనుల్లో భాగంగా వరంగల్ శివనగర్‌లోని కాకతీయుల కాలం నాటి మెట్ల బావి (రాణి రుద్రమదేవి స్నానాల బావి)లో రంగు మారిన నీటిని ఆదివారం విద్యుత్ మోటార్లతో తొలగించారు. స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. పూడికతీత పనులూ ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక నిపుణుల సూచనల మేరకు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కుమారస్వామి తెలిపారు. బల్దియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ప్రజలకు ఆర్థిక నష్టం



కాజీపేట అర్బన్: జమిలి ఎన్నికలతో ప్రజలకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందని ప్రొఫెసర్ ఆకుతోట శ్రీనివాసులు తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మాజీ మంత్రి తక్కళ్లపల్లి పురుషోత్తం నివాసంలో తెలంగాణ జనవేదిక ఆధ్వర్యంలో 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టి ప్రజలపై భారాలు మోపాలని చూస్తున్నట్లు తెలిపారు. భారతదేశం ఒక రాష్ట్రాల యూనియన్‌గా ఏర్పాటైన తర్వాత ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం మోపాలని చూస్తోందని తెలిపారు. సదస్సులో ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరస్వామి, జనవేదిక బాధ్యులు ముంత్రాతి సురేష్, క్రాంతి, సాంబయ్య, ఎ.యాకూబ్, ఉదయ్, బి.రంగారావు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు



సంగెం : మండల కేంద్రంలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

జిల్లాలో పోచమ్మ బోనాలను ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని దప్పుచప్పుళ్లతో ఆలయాలకు తరలివెళ్లారు. నైవేద్యం, పసుపుకుంకుమ సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, గొర్రెపోతులను బలిచ్చారు. అందరిని చల్లగా చూడాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట : బోనాలతో తరలి వెళ్తున్న మహిళలు



గీసుకొండ : మొగిలిచర్లలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కాంగ్రెస్‌లో టికెట్ల కొట్లాట

'గ్రేటర్' పరిధిలో ఐదు సీట్ల కోసం గొడవ

- కేంద్ర పరిశీలకుల ఎదుటే బల ప్రదర్శన..
- అధిష్టానం దృష్టికి గ్రూపుల పోరు..
- పార్టీలో రోజురోజుకూ పెరుగుతున్న వర్గపోరు
- సీడబ్ల్యూసీ పరిశీలనలో ఆశావహుల దరఖాస్తులు



సాక్షిప్రతినిధి, వరంగల్: 'ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం' అన్నట్లుగా ఉంది కాంగ్రెస్ పార్టీలో కొందరు ఆశావహుల తీరు. ఆగస్టు 18 నుంచి 25 వరకు అసెంబ్లీ స్థానాల వారీగా ఆశావహుల నుంచి ఆ పార్టీ అధిష్టానం దరఖాస్తులు స్వీకరించింది. డీసీసీ, టీపీసీసీ, ఎన్నికల నిర్వహణ కమిటీలో పరిశీలన పూర్తయిన అనంతరం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కూడా పరిశీలించి అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు అధిష్టానం ప్రకటించింది. ఇదంతా సుమారు 15–20 రోజుల పాటు జరిగే ప్రక్రియ. అయితే ఓ వైపు ఆ తంతు సాగుతుండగానే.. నియోజకవర్గ స్థాయి సదస్సుల్లో చాలాచోట్ల ఆశావహులు బలప్రదర్శనకు దిగడం వివాదాస్పదం అవుతోంది. మీసాలు మెలేయడం.. తొడలు కొట్టుకోవడం క్యాడర్‌ను అయోమయంలో పడేస్తుండగా.. వర్గాల పోరు రోజురోజుకూ రాజుకుంటోంది. ఇటీవల వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో ఆశావహులు పార్టీ కేంద్ర పరిశీలకుల ఎదుటే బలప్రదర్శనకు దిగారు. దీంతో రసాభాసగా ముగిసిన సమావేశాలపై టీపీసీసీ, ఏఐసీసీ ఆరా తీస్తుండటం పార్టీవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పరాకాష్టకు పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్

పరకాల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం కూడా రసాభాసగా జరిగింది. ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కొండా మురళీధర్‌రావు పరిశీలకుల ముందే బాహాబాహీకి దిగారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ ఇది నా అడ్డా అంటూ మీసం తిప్పగా.. ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఇది నా అడ్డా అంటూ తొడ గొట్టడం వివాదాస్పదం అయ్యింది. ఈ సమావేశానికి హాజరైన పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు రెండుగా చీలిపోగా.. కొండా, ఇనుగాల వర్గీయులు పరస్పరం దుర్భాషలాడుకోవడం, తోపులాటకు దిగిన ఘటనలపై అధిష్టానం ఆరా తీస్తున్నది.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సైలెంట్‌గా కొనసాగిన వర్గ రాజకీయాలు ఒక్కసారిగా పరాకాష్టకు చేరాయి. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అనుచరులు రెండు వర్గాలుగా ఏర్పడి నేతలకు అనుకూలంగా నినాదాలు చేయడం, ఒకరికొకరు నెట్టివేసుకోవడం, పరస్పరం దాడి చేసుకోవడం వరకు వెళ్లింది. వీరితోపాటు మరో ఆరుగురు 'స్టేషన్' కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. జనగామ నియోజకవర్గంలో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్గాల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న చందంగా మారింది. ఈ రెండు వర్గాల పంచాయితీ పలుమార్లు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు కూడా చేరింది.

కుమ్ములాటలు.. కొట్లాటలు

ఉమ్మడి వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మూడు కుమ్ములాటలు, ఆరు కొట్లాటలు అన్నట్టుగా తయారైంది. వరంగల్ జిల్లా కేంద్రంలోనే కాదు ఎనిమిది నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. వరంగల్ పశ్చిమ నుంచి 2018లో ఆశించి భంగపడ్డ నాయిని రాజేందర్‌రెడ్డికి ఈసారి దాదాపు టికెట్ ఖాయమన్న అధిష్టానం సంకేతాలతో పని చేస్తున్నారు. గతంలో పశ్చిమ కోసం నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ మధ్య పోటీ ఉండేది. దీంతో ఆ ఇద్దరి నేతల మధ్యన వర్గపోరు చాలానాళ్లు సాగగా స్వర్ణ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కావడంతో ఆమె తూర్పు నియోజకవర్గం వైపు మారారు. కొత్తగా జనగామ డీసీసీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పశ్చిమ టికెట్‌పై గురిపెట్టడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల హనుమకొండ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జ్ దాల్వి సమక్షంలోనే పోటాపోటీ నినాదాలతో బలప్రదర్శనకు దిగడం చర్చనీయాంశమైంది. తూర్పు నియోజకవర్గం కొండా సురేఖకు ఖాయమనుకున్న సమయంలో ఇక్కడి నుంచి ఎర్రబెల్లి స్వర్ణ కూడా దరఖాస్తు చేసుకున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఢిల్లీ నుంచి హాజరైన పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దాల్వి, రాష్ట్ర పార్టీ నుంచి శోభారాణి తదితరులు హాజరైన ఈ సమావేశంలో ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న కేఆర్.నాగరాజు, నమిండ్ల శ్రీనివాస్ అనుచరులు బల ప్రదర్శనకు దిగారు. కాగా వేదిక పైకి నాగరాజును పిలవడంతో నమిండ్ల శ్రీనివాస్ అనుచరులు ఆందోళనకు దిగారు. దీంతో అరగంట పాటు సమావేశం స్తంభించగా కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళానికి దారి తీసింది. ఇక్కడి నుంచి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో పాటు మొత్తం పది మంది దరఖాస్తు చేసుకున్నారు.

అభివృద్ధి కోసం ఐక్యంగా కలిసి రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రచ్చ శ్రీనుబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నియోజకవర్గ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కలిసి రావాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. నర్సంపేట మండలం మగ్ధుంపురం గ్రామానికి చెందిన 30 మంది, జీజీఆర్‌పల్లికి చెందిన 20 కుటుంబాలు, దుగ్గొండి మండలం నాచినపల్లికి చెందిన 15 కుటుంబాలు, చాపలబండకు చెందిన ఎండీ.కాబీర్ పాషా, ఎండీ. షాన్‌పాషా, సింగినబోయిన రాజు, కత్తుల శ్రీకాంత్, యాదగిరి, రాజ్‌కుమార్, సానబోయిన సతీష్, తనుగుల సాంబయ్య, నెక్కొండ మండలం సాయిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కట్టా నర్సింహారావు, బొడ్డు సంపత్, బానోతు కోటేశం కాంగ్రెస్‌కు రాజీనామా చేసి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు నామాల సత్యనారాయణ, సుకినె రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, క్లస్టర్ బాధ్యులు పాల్గొన్నారు.

రచ్చ శ్రీనుబాబును అభినందించిన ఎమ్మెల్యే

ముంబై ప్రియదర్శిని స్పోర్ట్స్ స్టేడియంలో ఇటీవల ఇండియా లెవల్‌లో బ్లాక్ బెల్ట్ డాన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 280 మంది పాల్గొనగా 8 మంది మాస్టర్లకు 7వ డిగ్రీ డిప్లొమా వచ్చింది. తెలంగాణ నుంచి నర్సంపేటకు చెందిన రచ్చ శ్రీనుబాబు 7వ డాన్ డిప్లొమా సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రచ్చ శ్రీనుబాబును ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అభినందించారు. అలాగే, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ముత్యం రాంచరణ్‌ను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు.

ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి




చర్చాగోష్టిలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఉద్యమంలో సర్వస్వం కోల్పోయి జైలుపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఉద్యమకారులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్ల పవన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ వ్యతిరేకులను బీఆర్ఎస్ అందలం ఎక్కించి, నిజమైన ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం చేసిందని విచారం వ్యక్తం చేశారు. ఉద్యమాలు చేయని వారికి మేలు చేసి, అసలైన ఉద్యమకారులను కష్టాలపాలు చేసిందని అన్నారు. స్వరాష్ట్రం కోసం తెగించి పోరాడిన వారికి కనీస గుర్తింపు దక్కలేదని పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారుల ప్రస్తావనే లేకపోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ఉద్యమకారులకు అండగా నిలవాల్సిన అవసరం ఏర్పడిందని, ఉద్యమకారుల గోస ఊరికే పోదన్నారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు, ఉద్యమకారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఉద్యమకారుల కోసం తాను చేస్తున్న ఈ పోరాటంలో కలిసి రావాలని కోరారు. తమ బాధను అర్థం చేసుకొని అండగా నిలుస్తున్న ప్రకాశ్‌రెడ్డికి ఉద్యమకారులు కృతజ్ఞతలు తెలిపారు.

రుద్రేశ్వరాలయంలో సంకటహర చతుర్థి పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. ముందుగా ఉత్తిష్ట గణపతికి పంచామృతాభిషేకం, కుంకుమ విలేపన గంధోదక చూర్ణాభిషేకం అనంతరం గరికతో షోఢశోపచార పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జైళ్లశాఖ ఐజీ మురళీబాబు దంపతులు పాల్గొన్నారు.



గణపతి పూజలో పాల్గొన్న మురళీబాబు దంపతులు

వల్మిడి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తిలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : వల్మిడిలో నిర్వహించనున్న సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆదివారం వల్మిడి ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్సవాలకు సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి, మంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పూస మధు, గబ్బెట బాబు, ఉందాటి సతీష్, ఎండీ నయీం, కాశీనాథం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రేపు సామూహిక గురుపూజోత్సవం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మార్గం భిక్షపతి

వర్ధన్నపేట: అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ (ఏజీఎఫ్) ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో మంగళవారం సామూహిక గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి తెలిపారు. వర్ధన్నపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని 226 పాఠశాలలు, 30 గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న 1989 మంది ఉపాధ్యాయులు, వర్ధన్నపేట మండల పరిధిలోని 38 ప్రైవేట్ పాఠశాలలు, 2 ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న 290 మందిని సన్మానించనున్నట్లు తెలిపారు. ఎక్కడి ప్రజాప్రతినిధులు అక్కడే పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, ఆంగోతు భిక్షపతి, కొండేటి శ్రీనివాస్, తుమ్మల రవీందర్, కస్తూరి అరుణ్, ఎం. రాము, తిరుపతి సురేష్, బొంత కాంతం, కంజర్ల మహేష్, ఎలికట్టె యాకయ్య, కొండేటి సంపత్, ఐత యాకాంతం పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో 'టెండర్' దందా

- ఆర్థిక సాయం, పండుగల పేరుతో సుమారు రూ.కోటిన్నర నిధుల సమీకరణ
- ఏళ్ల తరబడి లెక్కలు చూపని నాయకులు
- మళ్లీ టెండర్ నిర్వహించేందుకు మల్లగుల్లాలు
- వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత



వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ మార్కెట్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో 'టెండర్ల' పేరిట దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మార్కెట్‌లోని వ్యాపారులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు, వినాయక చవితి పండుగతో ఇతరత్రా ఖర్చుల నిమిత్తం టెండర్లను నిర్వహించేందుకు వ్యాపారులంతా సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత మెటర్నిటీ ఆస్పత్రి స్థలంలో ఉన్న మార్కెట్ 1994లో లక్ష్మీపురానికి మారింది. అప్పటి నుంచి నెలకోసారి టెండర్లు నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో మృతుల కుటుంబాలకు, పండుగల నిర్వహణకు వినియోగిస్తున్నారు. మార్కెట్ ఇక్కడికి మార్చినప్పటి నుంచి టెండర్లతో రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా లెక్కల ఊసే లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఎంత ఆదాయం వచ్చింది.. మృతుల కుటుంబాలకు ఎంత ఆర్థిక సహాయం అందించారు.. ఏ పండుగకు ఎంత ఖర్చు చేశారనే విషయం కమిటీలోని ఇద్దరు, ముగ్గురు పెద్దలకు తప్ప మిగిలిన వ్యాపారులకు సమాచారం ఇవ్వడం లేదని తెలిసింది. 1994 నుంచి 2005 వరకు, 2005 నుంచి 2021 వరకు రెండు కమిటీల ఆధ్వర్యంలోనే ఈ టెండర్ల నిర్వహణ జరిగినట్లు సమాచారం. 2021లో ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో గత ఏడాది ఒకసారి టెండర్ నిర్వహించినా దానికి కూడా లెక్కలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

టెండర్ అంటే..

మృతి చెందిన వ్యాపారుల కుటుంబాలకు ఆర్థిక సాయం, వినాయకచవితి నవరాత్రుల నిర్వహణ, మార్కెట్ పరంగా ఖర్చుల కోసం నిధుల సమీకరణకు టెండర్ నిర్వహిస్తారు. టెండర్ పెట్టిన రోజున పాడినవారికి మాత్రమే మార్కెట్‌లో కూరగాయలు అమ్మేందుకు అనుమతి ఇస్తారు. ఒకవేళ ఇతరులు అమ్మినా టెండర్ పొందిన వ్యక్తికి ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి టమాట, మిర్చి, క్యాప్సికం, క్యారెట్, కొత్తిమీరతో పాటు అన్ని కూరగాయలు టెండర్ పొందిన వ్యాపారికి మాత్రమే వస్తాయి. ఇతరులకు వస్తే టెండర్ హక్కుదారుడు నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. టెండరు పొందిన వ్యాపారి టమాట, మిర్చితో పాటు ఇంగ్లిష్ ఐటెంలుగా పిలిచే క్యాప్సికం, బీట్‌రూట్, క్యారెట్, ఇతర కూరగాయలను విక్రయించేందుకు వేర్వేరుగా ఇతర వ్యాపారులకు అప్పగిస్తారు. వారు చిరువ్యాపారుల వద్ద వసూలు చేసి టెండర్‌దారునికి ఇస్తే అతను టెండర్ మొత్తాన్ని వ్యాపారుల సంఘానికి చెల్లిస్తారు.

30 ఏళ్లుగా నిర్వహణ..

30 ఏళ్లుగా నిర్వహిస్తున్న టెండర్లతో సమకూరిన ఆదాయానికి సంబంధించిన లెక్కలు ఇప్పటి వరకు చెప్పడం లేదని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మృతుల కుటుంబాలకు అందించిన ఆర్థిక సహాయం, ఖర్చులు మినహా మిగిలిన డబ్బులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందని అంటున్నారు. గత ఏడాది ఆగస్టులో వినాయకచవితి పండుగ సందర్భంగా నిర్వహించిన టెండర్ ద్వారా సుమారు రూ.4లక్షలకు పైగా ఆదాయం కమిటీకి సమకూరింది. ఈ డబ్బులు ఏం చేశారన్న విషయం కమిటీలోని ఇద్దరు, ముగ్గురికి తప్ప మిగిలిన వారికి సమాచారం లేదని తెలుస్తోంది. ఏటా గణపతి నవరాత్రుల పేరుతో లక్షల రూపాయలు సమకూరుతున్నా.. ఖర్చులు మాత్రం కమిటీ సభ్యుల ముందు పెట్టడం లేదని వాపోతున్నారు. ఈక్రమంలో మళ్లీ ఈ ఏడాది వినాయక చవితి కోసం టెండర్ నిర్వహించాలని కమిటీ ప్రయత్నాలు చేస్తున్నా.. వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ టెండర్ నిర్వహించేందుకు సోమవారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

ఓటరు జాబితాలో లోపాలను సవరించాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మడికొండ : ఓటరు జాబితాలో లోపాలను సవరించాలని కలెక్టర్ ప్రావీణ్య బీఎల్‌ఓలను ఆదేశించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని మడికొండలో ఓటరు నమోదు, సవరణల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పానగోటి వెంకట్‌రావు పోలింగ్ బూత్‌ల్లో ఉన్న కొన్ని లోపాలను కలెక్టర్‌కు ప్రత్యేకంగా చూపెట్టి సవరణలు చేయాలని సూచించారు. కలెక్టర్ స్పందించి తగు సవరణలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కాజీపేట తహసీల్దార్ భావుసింగ్, స్థానిక నాయకులు వెంకట్‌రావు, గడ్డం మహేందర్, సారంగపాణి, స్థానిక నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

కడుపు నొప్పి తాళలేక..

● వివాహిత ఆత్మహత్య



లీల మృతదేహం

గార్ల: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గుగులోత్ లీల(30) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి ఆదివారం తీవ్రం కావడంతో గడ్డి కలుపు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబీకులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా, 10 ఏళ్ల క్రితం మృతురాలి భర్త కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఘటనపై కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..



అశోక్ (ఫైల్)

టేకుమట్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కొలాని అశోక్(35) తన కున్న అరఎకరం భూమితో పాటు, గత సంవత్సరం ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, వరి, మిర్చి పంటలు సాగు చేశాడు. మిర్చి పంటతో పూర్తిగా నష్టపోవడంతో ప్రస్తుతం మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. అప్పులు సుమారు రూ. 7లక్షల వరకు పెరగడంతోపాటు మహాముత్తారం మండలం ఓడేడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఆర్థిక లావాదేవీల విషయంలో కొన్ని రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఉదయం పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108లో వరంగల్ ఎంజీఎం తరలించి చికిత్స అందిస్తుండగా అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆదివారం మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

మనుగొండలో మరొకరు..

గీసుకొండ : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన నమిండ్ల స్వామి (56) ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటి వద్ద అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ రామకృష్ణ తెలిపారు.

రాములోరు నడయాడిన నేల..

● మునులు తపస్సు చేసిన ఆధ్యాత్మిక క్షేత్రం..
● స్వయంభువుసమేతంగా వెలసిన శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు
● రూ.51 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
● నేడు వల్మిడిలోని సీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన



విద్యుత్ దీపాల వెలుగులో వల్మిడి రామాలయం

జనగామ: సీతారామ, లక్ష్మణుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రం.. మునులు తపస్సు చేసిన ఆధ్యాత్మిక క్షేత్రం.. ఆది కావ్యం రామాయణం రాసిన సృష్టి కర్త వాల్మీకి పుట్టిన పుణ్యభూమిలో భక్తి పారవశ్యం నెలకొంది. చారిత్రక రాములోరి క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయోధ్య, భద్రాద్రి పుణ్యక్షేత్రాల చరిత్ర కలిగిన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపన వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సాహిత్య, సంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న పాలకుర్తి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.149 కోట్లు విడుదల చేయగా.. వల్మిడి సీతారామ చంద్రస్వామి ఆలయ పునర్నిరాణానికి రూ.51 కోట్లు కేటాయించింది. ఈ నెల1వ తేదీన ప్రారంభమైన పునః ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు.. నేటి(సోమవారం)తో ముగియనున్నాయి.

యాదాద్రికి ఉపయోగించిన గ్రానైట్..

వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ నిర్మాణ సమయంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట నిర్మాణంలో ఉపయోగించిన గ్రానైట్‌ను వినియోగించారు. దాదాపు 10 వేల టన్నుల గ్రానైట్‌తో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. చరిత్రలో నిలిచిపోయేలా దేవాలయం నిర్మాణం భక్తులను మంత్రముగ్ధులను చేస్తుంది.

నేడు వల్మిడికి చిన జీయర్ స్వామి

ఆలయ ప్రారంభం.. విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి సోమవారం చినజీయర్ స్వామి వల్మిడికి రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు, వేద పండితులు నిమగ్నమయ్యారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో రాయపర్తి, చెన్నూరు దేవాలయాల ప్రధాన అర్చకులు రంగాచార్య స్వామి, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు జరుగనున్నాయి.

వల్మిడి చరిత్ర..

ఆదికావ్యం రామాయణం రాసిన వాల్మీకి మహర్షి జన్మించిన వల్మిడి గ్రామం శ్రీరాముడి చరిత్రకు సాక్ష్యంగా చెప్పుకుంటారు. పాలకుర్తి మండల కేంద్రానికి 5కిలో మీటర్ల దూరం దక్షిణ దిక్కున మునుల, రాములవారి రెండు గుట్టల మధ్య ఈ గ్రామం ఉంది. వాల్మీకి మహర్షి వల్మిడి వాస్తవ్యుడిగా ఈ ప్రాంత ప్రజలు గొప్పగా చెప్పుకుంటారు. మహిమాన్వితమైన ఈ క్షేత్రం నేటి నుంచి మరింత ప్రాచుర్యం పొందనుంది.

మునుల గుట్టపై రుషులు తపస్సు చేయగా... రాములోరి గుట్టపై శ్రీరాములు, సీతా, లక్ష్మణులు ఉండే వారని ప్రచా రంలో ఉంది. స్వామి వారు గుట్టపై ఉన్న పాలగుండంలో సతీసమేతంగా స్నానమాచరిస్తూ.. అక్కడే స్వయంభూగా వెలిసినట్లు భక్తుల విశ్వాసం. శ్రీరాముడి పాద ముద్రికల ఆధారంగా ఇదే గుట్టపై రాములోరు నివసించినట్లు భక్తులు ఇప్పటికీ నమ్ముతారు. మునులగుట్టపై వాల్మీకి మహర్షి తపస్సు చేసే సమయంలో ఆయన చుట్టూ పుట్ట (వాల్మీకం) ఏర్పడగా.. అప్పటి నుంచి గ్రామానికి వాల్మీకిపురంగా నామకరణం చేశారు. కాలక్రమేనా వాల్మిడి గ్రామంగా పిలువబడుతుంది. శ్రీరాముడు, సీతా, లక్ష్మణుడు నడియాడన వల్మిడి క్షేత్రంలోనే లవకుశులు జన్మించగా.. వాల్మీకి వారిని అక్కున చేర్చుకున్నట్లు పూర్వీకులు చెబుతారు. వాల్మీకి జనగామ ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణం. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంకల్పంతో సీతారామచంద్రస్వామి ఆలయం పునఃప్రతిష్ఠతో పూర్వ వైభవం సంతరించుకుంటోంది.

మూడో రోజు ప్రత్యేక పూజలు..



సీతారామచంద్రస్వామి వార్ల ప్రతిమలు

పాలకుర్తి /పాలకుర్తి టౌన్: వల్మిడి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు సేవాకాలం, ప్రాబోధ ఆరగింపు, మృత్తికాదివాసం, పంచవింశతా,కలశాభిషేకం, అష్టధాన్యదృష్టి, నయోనోన్మాలినం నిర్వహించారు. 12 గంటలకు మంగళశాసనం, చతుస్థానార్చన, స్వస్తివాచనం, పంచగవ్యాధివాసం, కలశాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వంచారు.

వల్మిడి దేవాలయ ప్రాంగణంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో కలిసి మంత్రి దయాకర్‌రావు ఏర్పాట్లు సమీక్షించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతారని, 30 వేల మందికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

మంత్రుల పర్యటన వివరాలు..

● వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయ ప్రారభోత్సవానికి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ హాజరుకానున్నారు.
● 12.30 వల్మిడిలో సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, 1.15 మధ్యాహ్న వల్మిడిలో ఆలయానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జ్(వంతెన) ప్రారంభం.
● 1.30 పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం, ఆలయ దర్శనం, 1.45 పాల్కురికి సోమనాథ శృతి వనం ప్రారంభం, 2.20 మిషన్ భగీరథ గెస్ట్‌హౌజ్ ప్రారంభోత్సవం, 2.30 హరిత హోటల్, 2.45 గిరిజన భవన్ నిర్మాణానికి భూమి పూజ.

అడ్జెంట్ ఫ్యాకల్టీ శ్రీనివాసులు రాజీనామా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల అడ్జెంట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసులు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రం అధికారులకు అందజేశారు. యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేసి కొంతకాలం క్రితం ఆయన ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏడాది పాటు ఆయనను అడ్జెంట్ ఫ్యాకల్టీగా నియమించారు. ఇంజనీరింగ్ విభాగాలకు డీన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలోనూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారనే విషయం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. ఒక్కరే రెండు చోట్ల బాధ్యతలు నిర్వర్తించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల కేయూలో ఇంజనీరింగ్ విభాగాల్లో పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఆయనే డీన్‌గా వ్యవహరించారు. ఇంజనీరింగ్ కళాశాలలో అడ్జెంట్ ఫాక్యల్టీగా పని చేసేందుకు విముఖత తెలియజేస్తూ యూనివర్సిటీ అధికారులకు శ్రీనివాసులు రాజీనామా లేఖను అందజేశారని యూనివర్సిటీలో ఆదివారం చర్చ జోరందుకుంది. ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేట్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా పని చేసేందుకే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇంజనీరింగ్ విభాగాల డీన్‌గా శ్రీనివాసులు కొనసాగుతారా? అనేది వేచి చూడాల్సిందే.

చిన్నారి అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ

ఎంజీఎం : హనుమకొండలోని ఓ అపార్ట్‌మెంట్ పైనుంచి కిందపడి మృతి చెందిన అక్షర (13) అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ లభించనుందని తెలంగాణ నేత, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. జీవన్‌దాన్, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్షర ఇంటి వద్ద ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షర కుటుంబ సభ్యులను సత్కరించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడారు. అక్షర బ్రెయిన్‌డెత్‌కు గురి కావడంతో తల్లిదండ్రుల సహకారంతో ఆమె లివర్, లంగ్స్, కిడ్నీలు, పాంక్రియాస్‌ను దానం చేసినట్లు తెలిపారు. సంజీవ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

● భార్యాభర్తల రిమాండ్‌కు తరలింపు
● వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాసరావు



వివరాలు తెలుపుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తీగల కరుణాకర్ హత్య కేసులో నిందితులైన భార్యాభర్తలు చిక్కుడు నాగరాజు, మమతను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎస్.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. శివునిపల్లికి చెందిన చిక్కుడు నాగరాజు హమాలీగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తీగల కరుణాకర్ హైదరాబాద్‌లో ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శివునిపల్లిలో వారిద్దరి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉంటాయి. ఈ క్రమంలో కరుణాకర్‌కు, నాగరాజు భార్య మమతకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారిసింది. ఈ విషయం తెలిసిన నాగరాజు పలుమార్లు భార్యను హెచ్చరించినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో గత నెల 25న హైదరాబాద్ నుంచి కరుణాకర్ మమతకు ఫోన్ చేయగా నాగరాజు లిఫ్ట్ చేశాడు. ఫోన్‌లో కరుణాకర్ మాటలు విన్న నాగరాజు ఆగ్రహించాడు. కరుణాకర్‌ను శివునిపల్లికి రప్పించాలని భార్య మమతను బెదిరించాడు. ఆమె కరుణాకర్‌కు ఫోన్ చేసి 25న రాత్రి శివునిపల్లి శివారు మామిడితోట వద్దకు రావాలని కోరింది. దీంతో కరుణాకర్ మామిడి తోట వద్దకు రాగా నాగరాజు కత్తితో ఆయనను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని చెరువులో పడేశాడు. అనంతరం కరుణాకర్ ఫోన్‌ను జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లిలో కాల్చివేశాడు. హత్య ప్రదేశంలో రక్తపు మరకలు ఉంటే గుర్తిస్తారనే భయంతో కొబ్బరికాయలు, పసుపు కుంకుమ వేసి ఎవరికీ అనుమానం రాకుండా చేశాడు. అనంతరం భయం దోళనకు గురైన నాగరాజు పోలీసుస్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. దీంతో భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎ.రాఘవేందర్, ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ రాజమౌళి, పీసీలు కుమారస్వామి, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘బుట్ట’లో పడాల్సిందే..

● పురుగుల నివారణలో లింగాకర్షక బుట్టలతో మేలు
● పెట్టుబడి తక్కువ.. ఫలితం ఎక్కువ

కరీమాబాద్ : ఓ వైపు పెరిగిన పెట్టుబడులు.. మరో వైపు తగ్గుతున్న దిగుబడులు..ఇంకోవైపు మార్కెట్‌లో పంటలకు లభించని గిట్టుబాటు ధర.. వెరసి ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటే అన్నదాతలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కొందరు రైతులు మట్టిపై మమకారంతోనో లేదా వేరే పని తెలియకనో ధైర్యం చేసి అప్పు చేసైనా వ్యవసాయం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ పంటలకు పురుగుల బెడద అధికమవుతోంది. ఫలితంగా పంట చేతికి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పంటల సాగులో చీడపీడల నివారణకు లింగాకర్షక ‘బుట్ట’లతో ఎంతో ప్రయోజనం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటితో మిత్రకీటకాలు, పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు లింగాకర్షక బుట్టలపై అవగాహన పెంచుకుని పంటల సాగులో ఉపయోగించుకుంటే ఎంతో లాభం ఉంటుందని వారు చెబుతున్నారు.

లింగాకర్షక బుట్ట(ఎర)లు అంటే..

పంటల్లో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ద్వారా పురుగులను ముందుగా గుర్తించడమే కాకుండా వాటి సంఖ్యను కూడా గుర్తించొచ్చు. ఒక పురుగు మరొ పురుగుతో మాట్లాడేందుకు కొన్ని రకాల ఫెరామోన్లను ఉపయోగించుకుంటాయి. ఈ ఫెరామోన్లను ప్రయోగశాలల్లో కృత్రిమంగా తయారు చేసి ‘ఎర’లో ఉంచడం ద్వారా ‘మగ’పురుగును ఆకర్షించి బుట్టలో బంధించొచ్చు.



లింగాకర్షక బుట్ట

ఖర్చు తక్కువ..

చేలలో ఏర్పాటు చేసే బుట్టలతో తక్కువ ఖర్చుతో పురుగులను నివారించడంతోపాటు ఈ పద్ధతి ద్వారా పురుగులను ముందుగా గుర్తించి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. పురుగుల ఉధృతి, వాటి సంఖ్యను కూడా లెక్కించే అవకాశం ఉంటుంది.



పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తున్న శాస్త్రవేత్తలు

ప్రయోజనాలు..

1. లింగాకర్షక బుట్టలు తల్లి పురుగులు గుడ్లు పెట్టక ముందే వాటి ఉనికిని తెలుపుతాయి. దీంతో పురుగుల ఉధృతి పెరగక ముందే అరికట్టొచ్చు.
2. మగ రెక్కల పురుగులను ఆకర్షించి ఆడ పురుగులతో సంయోగం జరగకుండా చేస్తాయి. దీంతో ఆడ పురుగులు గుడ్లు పెట్టకముందే చనిపోతాయి. దీంతో పురుగుల సంతతి తగ్గుతుంది.
3. లింగాకర్షక బుట్టలలో రసాయనాలను ఉంచడం ద్వారా మగ పురుగులను చంపొచ్చు.
4. పంటలకు మేలు చేసే మిత్ర కీటకాలు, పర్యావరణానికి ఎలాంటి హాని చేయవు. సేంద్రియ వ్యవసాయంలో పంటను నష్టం చేసే పురుగులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

వాడకం..

1. పంట ముప్పై రోజుల వయసు నుంచి వాడాలి.
2. ఎకరానికి 8 బుట్ట(ఎర)లు అమర్చాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 10 అమర్చాలి.
3. లింగాకర్షక బుట్టలలో వాడే రసాయనాన్ని 22 రోజులకు ఒకసారి మార్చాలి.
4. ఎరలను అమర్చేటప్పుడు చేతులకు ఎలాంటి వాసన రాకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
5. బుట్టల్లో పడిన పురుగులను ప్రతీ 2–3 రోజులకు ఒకసారి లెక్కించి వాటి సంఖ్యను లెక్కగట్టాలి. దాని ఆధారంగా సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటించాలి.
6. బుట్టలను పంటపై అడుగు ఎత్తులో అమర్చాలి.

బావిలో పడి వ్యక్తి మృతి



వివరాలు సేకరిస్తున్న ఎస్సై ప్రసాద్

ఆత్మకూరు: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని అక్కంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన నాగనబోయిన కుమారస్వామికి ఓ కుమారుడు రాజు(28), కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో కుమారస్వామి ఆదివారం తన కుమారుడు రాజుతో కలిసి వ్యవసాయ భూమిలో నీళ్లు కట్టడానికి వెళ్లారు. రాజు మోటార్ ఆన్‌చేయడానికి బావి వద్దకు వెళ్లాడు. ఎంతకూ నీళ్ల రాకపోవడంతో తండ్రి వెళ్లి చూసేసరికి రాజు బావిలో పడి మృతి చెంది కనిపించాడు. స్థానికుల సాయంతో రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కోతి చేష్టలతో గృహిణి..

● మానుకోటలో దారుణం



సాబీరాబేగం(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : కోతి చేష్టలకు ఓ గృహిణి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ అర్జున్‌రెడ్డి ఆస్పత్రి సమీపంలో ఆదివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానికంగా నివాసం ఉండే ఎండీ.గౌస్ భార్య సాబీరాబేగం(55) రోజు మాదిరిగానే ఉదయం నిద్రలేచి ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్నది. ఈ క్రమంలో వారి ఇంటిపై సిమెంటు దిమ్మెకు కట్టి ఉన్న విద్యుత్ వైరును కోతుల గుంపు ఊపడంతో ఆ దిమ్మె ఒక్కసారిగా ఊడిపోయింది. అదే సమయంలో వాకిలి ఊడ్చి ఇంట్లోకి వెళ్లడానికి కదులుతున్న సాబీరాబేగం ఎడమ భుజంపై.. తర్వాత ఎడమకాలుపై పడింది. దీంతో తలకు లోపలి భాగంలో తీవ్రగాయమైంది. కాలు విరిగింది. రక్తస్రావంతో కుప్పకూలిపడిపోగా గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.

ఫిట్స్‌తో ఓటాయిలో గర్భిణి..

నర్సంపేట రూరల్ : ప్రసవ సమయంలో ఫిట్స్ రావడంతో గర్భిణి మృతి చెందిన ఘటన నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఓటాయి గ్రామానికి చెందిన పులుసం సుజాత (36) గతంలో ముగ్గురు కూతుళ్లకు జన్మనిచ్చింది. నాల్గో ప్రసవం కోసం ఆమెను కుటుంబీకులు నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెండ్రోజుల క్రితం తీసుకొచ్చారు. వైద్యులు ఆమెను ప్రసవం చేస్తుండగా ఫిట్స్‌కి గురై మృతి చెందింది.

చెట్టును ఢీకొన్న డీజే వాహనం..

● ముగ్గురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు
● చికిత్స పొందుతున్న ఒకరి మృతి
● మరొకరి పరిస్థితి విషమం
● అంబాలలో ఘటన



పృథ్వీ (ఫైల్)



ప్రమాదంలో క్షతగాత్రులు

కమలాపూర్: పెళ్లి బరాత్‌లో పాల్గొని వస్తున్న డీజే వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన కొయ్యడ రాకేష్, జోరుక సందీప్ , కక్కర్ల పృథ్వీ (18), పున్నంచందర్, హసన్‌పర్తికి చెందిన మేకల జిధ్యాన్.. ఏపీ 36 టీఏ 4854 నంబరు గల టాటా ఏస్ డీజే వాహనంతో శనివారం పరకాలలో జరిగిన ఓ పెళ్లి బరాత్‌లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం తమ ఇళ్లకు వస్తున్న క్రమంలో కమలాపూర్ మండలం అంబాల గ్రామ శివారులో డీజే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కక్కెర్ల పృథ్వీ మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు డ్రైవర్ కొయ్యడ రాకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

‘దళిత బంధు’ రాలేదని..

● వాటర్ ట్యాంకు ఎక్కిన దళితులు



వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న దళితులు

నెల్లికుదురు: ప్రభుత్వం నిరుపేద దళితులకు అండగా నిలిచేందుకు ప్రవేశపెట్టిన ‘దళిత బంధు’ పథకం అనర్హులైన బీఆర్ఎస్ పార్టీ వారికి మాత్రమే కేటాయిస్తున్నారంటూ మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో దళితులు ఆదివారం వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. అర్హులకు పథకం మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. న్యాయం చేస్తామని నచ్చజెప్పి వారిని కిందకు దింపారు. ట్యాంక్ ఎక్కిన వారిలో పురుషులతో పాటు మహిళలు 15 మంది వరకు ఉన్నారు.

తల్లిని గెంటేసిన తనయుడు

● ఆస్తులన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనం
● నేలపోగుల గ్రామంలో ఘటన
● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



బయటే నిలబడిన తల్లి పద్మ

లింగాలఘణపురం: తండ్రి మృతి చెందిన అనంతరం ఓ ప్రబుద్ధుడు.. తల్లిని బెదిరించి ఆమె పేరుతో ఉన్న భూమి, ప్లాటు తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అనంతరం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసుకుని తల్లిని బయటకు గెంటివేశాడు. దీంతో ఆ తల్లి దిక్కుతోచని స్థితిలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా ఆ తనయుడి తీరులో మార్పులేదు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నేలపోగులకు చెందిన కేమిడి పద్మ, అంజయ్య దంపతులకు కొడుకు నరేశ్, కూతురు అనూష ఉన్నారు. తండ్రి అంజయ్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అయినా కష్టాలు, బాధలు దిగమింగుతూ తల్లియే వీరిద్దరి వివాహం చేసింది. అంజయ్య మృతి చెందడంతో భూమి, ప్లాటు పద్మ పేరుతో ఉన్నాయి. కూతురు అనూషకు అప్పట్లో కట్నం ఇవ్వలేదు. ఇప్పుడు ఇవ్వమంటే కుమారుడు నరేశ్ నిరాకరిస్తూ తల్లిని బెదిరించి ఆమె బంగారం బ్యాంక్‌లో కుదువ పెట్టుకుని, భూమి, ప్లాటు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుని బెదిరిస్తున్నాడు. కొద్ది రోజులుగా తల్లి, కూతురుకు ఆరోగ్యం బాగులేకపోవడంతో నేలపోగులలోనే ఉంటున్నారు. శనివారం రాత్రి నరేశ్ తన భార్య భవానితో కలిసి తల్లి పద్మ, చెల్లి అనూషను గెంటేసి తాళం వేసి అత్తగారింటికి వెళ్లిపోయాడు. దీంతో పద్మ.. ఎస్సై ప్రవీణ్‌ను ఆశ్రయించింది. ఎస్సై వెంటనే సిబ్బందిని పంపించి తాళం తీయించి ఇంట్లోకి పంపించారు. ఆదివారం ఉదయం మళ్లీ వచ్చిన నరేశ్ తన భార్యతో వచ్చి పోలీసులకు చెబుతారా అంటూ తల్లిని, చెల్లిని తిడుతూ చంపుతానని బెదిరించడంతో ఆదివారం కొడుకు, కోడలిపై పద్మ.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.